క్లుప్తంగా

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

బాపట్ల అర్బన్: గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని శాసన మండలి సభ్యుడు, ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కోండుభొట్లవానిపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉమ్మారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ రాజ్ నిధులు రూ.1.80 లక్షలతో రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీ ఆర్‌ఈఓ శ్రీనివాస్, ఏఈ ఎస్.శివ రామకృష్ణ పాల్గొన్నారు.

5 నుంచి గోగులమ్మ ఆలయ వార్షికోత్సవాలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఈ నెల 5, 6 తేదీల్లో వైభవంగా నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, గ్రామోత్సవం, గురువారం నైవేద్యాల సమర్పణ, మొక్కుల చెల్లింపు ఉంటాయని పేర్కొన్నారు.

ధ్యాన మందిరం ప్రారంభం



భట్టిప్రోలు: భట్టిప్రోలు సాధన మండలి, బ్రహ్మ విద్యాశ్రమంలో నూతనంగా నిర్మించిన ధ్యాన మందిరంలో శుక్రవారం అష్టాక్షరి యజ్ఞం నిర్వహించారు. ధ్యాన మందిరాన్ని సాధన మండలి అధ్యక్షుడు బూర్లె సత్యన్నారాయణ, అరుణ కుమారి దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రజ్ఞానంద సరస్వతి(బాల స్వామిజీ), దాస సాహిత్య ప్రాజెక్ట్ అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు(వాసు) విచ్చేశారు. అష్టాక్షరి యజ్ఞంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం సమారాధన కార్యక్రమం జరిగింది. ఉదయం జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని పురోహితులు పాతూరి కాంతారామ శర్మ నిర్వహించారు.

ఆర్థిక సాయం అందజేత



పేరలి(కర్లపాలెం): పేరలి పంచాయతీ పడమర యాదవపాలేనికి చెందిన షేక్ సనీమన్ అనారోగ్యంతో మృతిచెందారు. అంత్యక్రియల నిమిత్తం.. మట్టి ఖర్చులకు శుక్రవారం పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పేరలి బాలకృష్ణమూర్తి సహకారంతో.. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాగిత బుల్లియ్య, ట్రస్ట్ కార్యదర్శి శ్రీనివాసరావు.. సనీమన్ కుటుంబ సభ్యులకు రూ.5వేల నగదు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు గొర్రుముచ్చు మీరయ్య, మద్దిబోయిన శివరావు, గేరా ఏసుబాబు, షేక్ సుభానీ, మల్లెల పౌలు, నాదెండ్ల బాబూరావు, కర్రి ముక్కంటి, కాటూరి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కర్లపాలెం: వేసవిలో మండల ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.దిలీప్ తెలిపారు. పెదగొల్లపాలెం రక్షిత తాగునీటి చెరువును నీటితో నింపుతున్న పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండల పరిధిలోని తాగునీటి చెరువులన్నింటినీ నీటితో నింపేందుకు కార్యదర్శులు, సర్పంచ్‌లు కృషి చేయాలని కోరారు. వేసవిలో అవసరం మేరకు వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. వాటర్ ట్యాంక్‌లను, సంపులను శుభ్ర పరుచుకుని పైప్‌లైన్ల మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని పంచాయతీ అధికారులకు ఆయన సూచించారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

భట్టిప్రోలు: ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు భట్టిప్రోలు ఎంఈఓ పులి లాజర్ శుక్రవారం తెలిపారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 680 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు చెప్పారు. వెల్లటూరు, పెదపులివర్రు, పల్లికోన జెడ్పీ ఉన్నత పాఠశాలలు, టీఎంరావు హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సంక్షేమంతో పేదల్లో పెరిగిన కొనుగోలు శక్తి

- పేద, మధ్య తరగతి జీవన ప్రమాణాలు పెంచాలన్నదే ప్రభుత్వ ఆశయం
- అందుకే సంక్షేమ పథకాలకు ప్రథమ ప్రాధాన్యం
- ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



నగదు చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: పేద, మధ్య తరగతి ప్రజల జీవన ప్రమాణాలను పెంచాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఆశయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. అందుకే సంక్షేమ పథకాలకు ప్రథమ ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. సంక్షేమంతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందని.. రాష్ట్రంలో జీఎస్టీ ఆదాయం పెరుగుదల ఇందుకు నిదర్శనమన్నారు. 3వ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు శుక్రవారం పట్టణంలోని 21, 22, 23, 24 వార్డుల పరిధిలో సీబీఎన్ కాలనీలో జరిగాయి. ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొని, మాట్లాడారు. పేదల జీవితాలు బాగుండాలన్న ఆశయంతోనే ప్రభుత్వం సంక్షేమానికి తొలి ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. రెండో ప్రాధాన్యతగా అభివృద్ధిని చేపడుతున్నట్లు వివరించారు. డ్వాక్రా మహిళా సంఘాలకు రుణ మాఫీ నగదు నాలుగో విడత జనవరిలో ఇచ్చేందుకు సీఎం వైఎస్ జగన్ నిర్ణయించినట్టు తెలిపారు. తమ కష్టార్జితానికి తోడుగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ఆర్థిక సాయంతో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఇంటిని చక్కదిద్దుకుంటూ, పిల్లలను చదివించుకుంటున్నారని చెప్పారు. మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖలేదా నసీం మాట్లాడుతూ సంక్షేమ పథకాలతోపాటు ఇళ్ల స్థలాలను అందజేసిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుని రుణం తీర్చుకుందామని సూచించారు. అనంతరం 21, 22, 23, 24 వార్డుల్లోని 1,917 మంది పొదుపు సంఘాల మహిళలకు రూ.1.92 కోట్ల చెక్కును ఎమ్మెల్యే శివకుమార్ అందజేశారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు తోక శిరీష, పెదలంక లక్ష్మీలావణ్య, షేక్ దుబాయ్‌బాబు, కో–ఆప్షన్ సభ్యురాలు గొరిగపూడి నిర్మల, కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, పార్టీ నేతలు జి.సుబ్రహ్మణ్యం, తోక వాసు, శానంపూడి రఘురామిరెడ్డి, బూరెల దుర్గా ప్రసాద్, ఎ.సీమోను, మున్సిపల్ సహాయ కమిషనర్ గోపాలరావు మాట్లాడారు. 'మెప్మా' మాధవరావు స్వాగతం పలికారు.

అతివలకే అగ్ర తాంబూలం



మున్నంగి సభకు హాజరైన డ్వాక్రా మహిళలు

మున్నంగి(కొల్లిపర): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాల్లోనూ మహిళలకే అగ్ర తాంబూళం వేసి మహిళా పక్షపాతిగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శుక్రవారం మున్నంగి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆసరా వారోత్సవాల సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. మున్నంగి, వల్లభాపురం, అత్తలూరిపాలెం, పిడపర్రు, పిడపర్తిపాలెం, దంతలూరు, అత్తోట, కుంచవరం గ్రామాల్లోని పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడతలో భాగంగా 471 సంఘాలకు రూ.3.39 కోట్ల మెగా చెక్కును అందించారు. సభకు అధ్యక్షతగా ఎంపీడీవో పి.శ్రీనివాసులు వహించారు. స్వయం సహాయక సంఘాలు ఏర్పడి సుమారు 20 ఏళ్లు కావస్తోందని.. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగనన్న నాయకత్వంలో డ్వాక్రా గ్రూపులను ఈ మూడున్నరేళ్లలో ఏవిధంగా ఆదుకున్నారో.. ప్రతి మహిళ ఆలోచించాలన్నారు. కొల్లిపర మండలంలో 1247 సంఘాల్లోని 12, 464 సభ్యులకు మూడు విడతలల్లో రూ.29.64కోట్లు వేసినట్లు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానకి ఎమ్మెల్యే శివకుమార్ సమక్షంలో డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ వేమూరి దీనమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, తెనాలి ఏఎంసీ చైర్ పర్సన్ అవుతు సీత, తహసీల్దారు జి.నాంచారయ్య , ఏపీఎం డి.ప్రియదర్శిని, మండల సమాఖ్య అధ్యక్షురాలు తమ్మా సుజాత, ఎంపీటీసీ1 ఆళ్ళ శ్రీలక్ష్మి, ఎంపీటీసీ2 చోడగిరి రామయ్య, మండలపరిషత్ ఉపాధ్యక్షులు బొల్లిముంత పోతురాజు, కళ్ళం వెంకటప్పారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి , ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, ఏడు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డ్వాక్రా మహిళలు, సచివాలయం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పాదుకా పట్టాభిషేకం



పట్టాభిషేక మహోత్సవం

తెనాలిటౌన్(కొల్లిపర): వసంత నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తెనాలిలోని హనుమాన్ చౌక్, బోస్ రోడ్‌లోని శ్రీ సీతారామ మందిరంలో శుక్రవారం వైభవంగా సీతారాముల పాదుకా పట్టాభిషేకం నిర్వహించారు. కల్లూరి వేంకట సూర్యనారాయణ మూర్తి, రాజేశ్వరి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం శ్రీసాయి వెంకయ్య స్వామి వారి ఆశీస్సులతో చివుకుల శివరామ ప్రసాద్ కుటుంబ సభ్యులు శ్రీసీతారాముల రథోత్సవం నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు ప్రభల సూర్యనారాయణ మూర్తి, కార్యదర్శి కల్లూరి వేంకట సూర్యనారాయణ మూర్తి, కోశాధికారి అక్కపెద్ది బాలగోపాల్, శ్రీ సీతారామచంద్ర ప్రభువు పాదార్చకులు అగ్నిహోత్రం నరసింహచార్యులు పాల్గొన్నారు.

తాటి బొత్తల ట్రాక్టర్ ట్రక్కు బోల్తా

యువకుడికి గాయాలు



కొల్లూరు: తాటి బొత్తలు రవాణా చేస్తున్న ట్రాక్టర్ బోల్తాపడి ఓ యువకుడు గాయాలపాలైన ఘటన కొల్లూరు వద్ద కరకట్టపై చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఈపూరు వైపు నుంచి పశ్చిమ బ్యాంక్ కెనాల్ కరకట్టపై చెరుకుపల్లికి తాటిబొత్తల లోడ్‌తో ట్రాక్టర్ వస్తోంది. అకస్మాత్తుగా ట్రాక్టర్ ట్రక్కు ఇరుసు విరిగి పోవడంతో.. ఇంజన్ నుంచి ట్రక్కు విడిపోయి ముందుకు దూసుకువెళ్లింది. అదే సమయంలో కొల్లూరు నుంచి ఈపూరు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పెసర్లంకకు చెందిన యువకుడు కూరేటి ఆనంద్‌కు ట్రక్కు బలంగా తాకడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. యువకుడికి తాకిన ట్రక్కు కరకట్ట అంచుకు పల్టీ కొట్టింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న కార్మికులు ప్రమాదాన్ని పసిగట్టి తప్పించుకునే ప్రయత్నం చేయడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని కొల్లూరు పోలీసులు వెల్లడించారు.

ఘనంగా శ్రీరాముని పట్టాభిషేకం



హనుమంతుని వేషధారణలో చిన్నారులు



కొల్లూరు గాంధీనగర్‌లో శ్రీరామ పట్టాభిషేక వేడుకలు

నగరం: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కొలగానివారిపాలెం శ్రీరామ మందిరంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ పట్టాభిషేక కార్యక్రమాన్ని భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి, తిలకించారు. సీతారాముల కల్యాణం జరిగిన మరుసటి రోజున అనవాయితీగా పట్టాభిషేకం చేస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. చిన్నారులు హనుమంతుని వేషధారణ గావించి, గ్రామ వీధుల్లో చేసిన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. పలు గ్రామాల్లో అన్న సంతర్పణ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

శ్రీరామ పట్టాభిషేక వేడుకలు

కొల్లూరు: శ్రీరామ పట్టాభిషేక వేడుకలు కొల్లూరులో కోలాహలంగా సాగాయి. శ్రీరామ నవమి అనంతరం పట్టాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులు మేళతాళాలతో శ్రీరామ స్తంభాన్ని గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వసంతోత్సవంలో భాగంగా కొల్లూరు గాంధీనగర్, కేటీ కాలనీలలో రంగులు చల్లుకుని వేడుకలు నిర్వహించారు. మండలంలోని పలు రామాలయాల వద్ద అన్న సంతర్పణ కార్యక్రమం చేపట్టారు.

ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలి

మున్సిపల్ కమిషనర్ విజయ సారథి



ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ, మెప్మా సిబ్బంది

రేపల్లె: రేపల్లెను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ విజయసారథి కోరారు. సచివాలయ, మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛ మిషన్ మార్చ్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ గృహాలతో పాటు పరిసరాలను స్వచ్ఛంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మహిళలు గృహ నిర్వహణలో వచ్చే వ్యర్థాలను తడి చెత్త–పొడి చెత్తగా వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. చెత్తను రహదారుల వెంబడి పడవేయరాదన్నారు. ఈ సందర్భంగా సచివాలయ, మెప్మా సిబ్బంది పట్టణంలోని ప్రధాన రహదారుల్లో స్వచ్ఛ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడు విజయ మోహన్‌కు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో శుక్రవారం సత్యం శివం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. అనంతరం ప్రముఖ సాంఘిక, పౌరాణిక నాటక కళాకారుడు కొక్కిలిగడ్డ విజయ మోహన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మిర్యాల శ్రీనివాసరావు, కాకుమాను ఉపేంద్ర, సుంకర హరికృష్ణ, ఈదర శ్రీనివాసరావు, గోపరాజు విజయ్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, సురభి ప్రభావతి, మధు, సాంబశివరావు, రామేశ్వరరావు, రమేష్, వంశీ, అవినాష్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

రేపల్లె: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పట్టణ ప్రజలకు నీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ తెలిపారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహించి, పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించటంతో పాటు ప్రత్యేక వాహనాల ద్వారా తాగునీటిని పంపిణీ చేసేందుకు చర్యలు చేట్టనున్నామన్నారు. ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్యానికి నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. అనంతరం ఏజెండాలోని 38 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, కమిషనర్ విజయసారథి పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

బాపట్ల: బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా పట్టణంలోని దేవుడి మాన్యంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణులకు, వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఎన్ఎస్ఎస్ అధికారిణి కృష్ణకుమారి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టరు రవిశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, కల్యాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి కిట్లు పంపిణీ



నగరం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈఓ కొలసాని హరిబాబు పేర్కొన్నారు. అల్లపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. విద్యార్థులు దాతలు అందించిన పరీక్ష సామగ్రి కిట్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాతలు కొప్పుల గోపీ, ఈమని ప్రేమ్ కుమార్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. హెచ్ఎం ఎస్.స్వర్ణలత, విద్యా కమిటీ చైర్మన్ భూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లలో సాంకేతిక సమస్యలు పరిష్కారం

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లలో నెలకొన్న సమస్యలను విద్యాశాఖ అధికారుల చొరవతో సిబ్బంది పరిష్కరించారు. విద్యా శాఖ పరిధిలోని టెక్నికల్ బృందం శుక్రవారం తెనాలి పట్టణంలోని పలు మున్సిపల్ పాఠశాలలకు వెళ్లి ట్యాబ్‌లలో టెక్నికల్ ఎర్రర్స్‌ను సరిచేశారు. ఈ సందర్భంగా స్టేట్ మోడల్ అధికారి సీహెచ్‌వీఎస్ రమేష్ కుమార్, జిల్లా నోడల్ పర్సన్ ఎస్.పూర్ణచంద్రరావు మాట్లాడారు. డిజిటల్ లెర్నింగ్ ఇంప్రూవ్ చేసేందుకు విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది వాటిలో గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులకు సంబంధించిన కంటెంట్‌ను పొందుపరిచినట్లు చెప్పారు. వచ్చే సంవత్సరం తెలుగు, ఇంగ్లీష్, హిందీ సబ్జెక్టుల కంటెంట్‌లను కూడా పొందుపరచనున్నట్లు వెల్లడించారు. ఉపాధ్యాయులకు ట్యాబ్‌లలో నెలకొనే చిన్న చిన్న సమస్యలు పరిష్కరించేలా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. వారి వెంట టేక్టోర కంపెని ప్రతినిధి సుమంత్, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎంపీపీ



మున్నంగి(కొల్లిపర): మున్నంగి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ భీమవరపు పద్మావతి శుక్రవారం ఎంపీడీఓ పి.శ్రీనివాసులతో కలసి మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులకు రాగిజావ క్రమం తప్పకుండా అందిచాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న రుచికరమైన భోజనాన్ని విద్యార్థులు తినేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. అనంతరం భోజనం రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేమూరి ధీనమ్మ, ఆరిగ చంద్రారెడ్డి, కళ్ళం వెంకటప్పారెడ్డి, లంకిరెడ్డి మురళీరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు దీపలత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ సాయిహరే రామ్, దాత నారాయణ

తెనాలిఅర్బన్: సమతా ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి వెంకట నారాయణ ఆధ్వర్యంలో గంగానమ్మ పేటలోని తోటకూర సుబ్బారావు మున్సిపల్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్స్ ఇతర సామగ్రిని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గడవర్తి సాయిహరే రామ్ మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన కిట్లను అందజేయటం అభినందనీయమన్నారు. ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డీవీఆర్ ప్రసాద్, సమతా ఫ్రెండ్స్ సభ్యులు అప్పారావు, జవ్వాజి ప్రసాద్, చంటి, పూర్ణచంద్ పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'కి మద్దతుగా ప్రచార యాత్ర



తెనాలి మార్కెట్ సెంటర్‌లో ప్రచారం

తెనాలి: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు మార్చుకోకుంటే ప్రభుత్వాన్నే మార్చేస్తాం.. అనే నినాదంతో ఏప్రిల్ 5న ఢిల్లీలో జరగనున్న మహా ప్రదర్శన, బహిరంగ సభను ప్రజలందరూ బల పరచాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివ సాంబిరెడ్డి కోరారు. ఆటో ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం పట్టణం, రూరల్ గ్రామాల్లో చేపట్టారు. ఈ సందర్భంగా శివ సాంబిరెడ్డి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదికి రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఇస్తామని, నల్లధనం వెలికితీసి ప్రజల ఖాతాల్లో రూ.15 లక్షలు లెక్కన జమ చేస్తామని చెప్పిన ప్రధాని మోది, దేశ ప్రజలను నిలువునా మోసగించారని ఆరోపించారు. సీఐటీయూ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలి మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిన మోది కార్మికద్రోహి విమర్శించారు. పాములు, షేక్ కరిముల్లా, శ్రీనివాసరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రూరల్ మండలం కొలకలూరుకు చెందిన వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, రమేష్ దంపతుల ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన సుద్దపల్లి డానియేలు, అతని మిత్ర బృందం దాదాపు 40 మందికి పైగా శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. తెనాలిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. పేదలకు పలు సంక్షేమ పథకాలను అందిస్తూ, ఇళ్ల స్థలాలను పంపిణీ చేసి ఇళ్లు కూడా నిర్మిస్తున్న ప్రభుత్వం, ఎమ్మెల్యే శివకుమార్ కార్యక్రమాలకు ఆకర్షితులై వారంతా పార్టీలో చేరినట్లు వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న వెల్లడించారు. కొలకలూరు గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని సుద్దపల్లి డానియేలు చెప్పారు. పార్టీలో చేరినవారిలో సుద్దపల్లి ఎలీషా, పెద్దోడు, చార్లీ, శేషయ్య, కారుమూరి శివ, సుద్దపల్లి నవీన్, అబ్రహాం, జ్యోతుల సునీల్, పి.బాలరాజు తదితరులున్నారు.

ఘనంగా అమ్మ శతజయంతి ఉత్సవాలు



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న బ్రహ్మాండం రవీంద్రరావు, పనబాక లక్ష్మి

బాపట్ల అర్బన్: అమ్మ శత జయంతి ఉత్సవాలు నాలుగవ రోజు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రముఖ రచయిత జయంతి చక్రవర్తి సంపాదకత్వంలో పూర్వ విద్యార్థుల సమితి రూపొందించిన 'జయహో మాత– అమ్మకు అక్షరాంజలి' గ్రంథాన్ని అమ్మ తనయుడు బ్రహ్మాండం రవీంద్రరావు ఆవిష్కరించారు. విశ్వజననీ పరిషత్ ప్రస్తుత సభ్యులు బొప్పూడి రామబ్రహ్మం అధ్యక్షత వహించారు. ప్రతి ఒక్కరికీ అమ్మ ఆశీస్సులు ఉంటాయన్నారు. జయంతి చక్రవర్తి వేల మంది విద్యార్థుల అనుభవసారాలు పొందు పరచబడి గ్రంథాన్ని రచించి అమ్మకు సమర్పించడం అభినందనీయమన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త వి.ఎస్.ఆర్.మూర్తి మాట్లాడుతూ కళాంజలి, చిత్రాంజలి, యశ్యాంజలి అనేవి త్రివేణి సంఘమమని, అమ్మ జ్ఞాపకాలు గ్రంథంలో ఆవిష్కరింపబడ్డాయన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకుడు గోగినేని రాఘవేంద్రరావు మాట్లాడారు. విద్యార్థులకు జ్ఞానభిక్షను ప్రసాదించారన్నారు. విశ్వజననీ పరిషత్ మేనేజింగ్ ట్రస్టీ గిరిధరకుమార్ మాట్లాడుతూ 1973లో అమ్మ స్వర్ణోత్సవాల్లో అమ్మ తన చేయి పట్టుకొని నడిపించిన మధుర జ్ఞాపకాన్ని గుర్తుచేసుకున్నారు. శత జయంతి ఉత్సవాలకు సహాయ సహకారాలు అందించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. విజయ రాజరాజేశ్వరి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామి అనుగ్రహ భాషణ చేశారు. కార్యక్రమంలో సంఘం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, మల్లాప్రగడ శ్రీమన్నారాయణ, మాజీ లోక్‌సభ సభ్యురాలు పనబాక లక్ష్మి, కొండముది రామకృష్ణ, అన్నయ్య ఫౌండేషన్ అధ్యక్షుడు కొండముది సుబ్బారావు పాల్గొన్నారు. అతిథులందరికీ విశ్వజనని పరిషత్తు ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి, అమ్మ జ్ఞాపికను బహూకరించి అమ్మ ప్రసాదాన్ని అందించారు.